ఫెంగల్ దూసుకొస్తోంది !

● 3 జిల్లాలకు రెడ్ అలర్ట్ ● ఆరు జిల్లాలకు భారీ వర్ష సూచన ● నగరంలో కుండపోత ● నేడు పాఠశాలలకు సెలవు



చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 'ఫెంగల్' తుఫానుగా మారే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. వాయుగుండం తుఫానుగా మారి తీరం వైపు దూసుకురానుండటంతో మూడు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. బంగాళాఖాతంలో ఈ నెల 22న ఏర్పడిన అల్పపీడనం, మరుసటిరోజు వాయుగుండంగా మారిందని, ఆ వాయుగుండం తుఫానుగా మారుతుందని, ఫలితంగా భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ కేంద్రం దక్షిణ మండల ఉన్నతాధికారి బాలచంద్రన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ వాయుగుండం మరింత తీవ్రరూపం దాల్చి తీరం వైపు దూసుకురానుండటంతో బుధవారం మైలాడుదురై, తిరువారూరు, నాగపట్టినం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఆ మూడు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. అదే సమయంలో తిరువళ్లూరు, కాంచీపురం, చెన్నై, చెంగల్పట్టు, విల్లుపురం, పుదుచ్చేరి, కడలూరు, అరియలూరు, తంజావూరు, పుదుకోట, శివగంగ, రామనాధపురం జిల్లాల్లో పలు చోట్ల భారీగా, ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని, ఈ నెల 30 వరకు జాలర్లు చేపలవేటకు వెళ్ళకూడదని ఆయన హెచ్చరించారు. బుధ, గురువారాల్లో నైరుతి బంగాళాఖాతంపై వాయువేగం అధికమవుతుందని, ప్రస్తుతం దట్టమైన మేఘాలు ఆవరించడంతో గంటకు 70 నుండి 80 కి.మీల మేర తీర ప్రాంతాల్లో పెనుగాలులు వీయనున్నాయని తెలిపారు.వాయుగుండం 'ఫెంగల్' తుఫానుగా మారే నేపథ్యంలో నగరంలో మంగళవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతా ల్లో వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఏ క్షణంలో ఎలాంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఎన్డీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి.


చెన్నైలో సిద్ధంగా వున్న ఎన్డీఆర్ఎఫ్ బలగాలు

కాశిమేడు రేవులో లంగరు వేసిన పడవలు


డెల్టా జిల్లాల్లో వర్షబీభత్సం..

వాయుగుండం కారణంగా డెల్టా జిల్లాల్లో మంగళవారం వేకువజాము నుండే కుండపోతగా వర్షాలు కురువటంతో జనజీవనం స్తంభించింది. తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై జిల్లాల్లో వేకువజాము నాలుగు గంటల నుండే చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. తంజావూరు జిల్లాలోని లో తట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వర్షం కారణంగా ఆయా జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఇదే విధంగా తిరువారూరు జిల్లాలోనూ ఉదయం సుమారు రెండు గంటల వరకూ కురిసిన భారీ వర్షం కారణంగా తిరువారూరు, నన్నిలం, తిరుత్తురైపూండి, చేందమంగళం, కారికోట్టై, కోట్టూరు, విక్రపాండి తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. నాగపట్టినం జిల్లాలో సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం మంగళవారం వేకువజామున తీవ్రరూపం దాల్చింది. నాగపట్టినం, వేలాంగన్ని, కీళ్‌వేలూరు, తిరుప్పూండి, నాగూరు తదితర ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. కొన్ని చోట్ల రోడ్లపై వర్షంపు నీరు వరదలా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

15 విమానాల సేవలకు అంతరాయం..

మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షాల కారణంగా మీనంబాక్కం విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మదురై, తిరువనంతపురం, కోవై, హైదరాబాద్, కొల్‌కత్తా నుంచి వచ్చిన ఐదు విమానాలు ల్యాండింగ్ కాలేక ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. అరగంట తర్వాత రన్‌వేపై వాననీరు తొలగించాక ఆ విమానాల ల్యాండింగ్‌కు అనుమతించారు. అదే విధంగా నగరం నుంచి ఢిల్లీ, సికింద్రాబాద్, ముంబయి, లక్నో తదితర ప్రాంతాలకు వెళ్లే ఎనిమిది విమానాలు వర్షం కారణంగా సకాలంలో బయలుదేరలేకపోయాయి. ఇలా 15 విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది.

తీరంలో 'అల'జడి

వాయుగుండం ప్రభావం కారణంగా నగరంలో సముద్రతీర ప్రాంతాల్లో అలల ఉధృతి అధికమైంది. పట్టినంబాక్కం, కాశిమేడు, ఎన్నూరు, బీసెంట్‌నగర్ తీరాల్లో అలలు ఐదు మీటర్ల ఎత్తున ఎగసిపడ్డాయి. తీరం వైపు రాక్షస అలలు ఎగసిపడుతుండటంతో కాశిమేడు జాలర్లు చేపలవేటకు వెళ్లలేదు. ఇక తిరువళ్లూరు నుంచి నాగపట్టినం వరకు సముద్రతీరం పొడవునా బుధవారం నుంచి శుక్రవారం వరకూ అలల ఎగసిపడే అవకాశాలు న్నాయని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు.

కాగా నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లోని పాఠశాలలకు ఆయా జిల్లాల కలెక్టర్లు బుధవారం సెలవు ప్రకటించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాతో పెరియకరుప్పన్ భేటి


అమిత్ షాకు తిరువళ్లువర్ విగ్రహం అందజేస్తున్న మంత్రి పెరియకరుప్పన్

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షాతో రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ ఢిల్లీలో భేటీ అయ్యా రు. ఈ సందర్భంగా రాష్ట్ర సహకార శాఖకు సంబంధించి వినతి పత్రాన్ని కేంద్రమంత్రికి సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సహకార సంఘాలకు అవసరమైన నిధులు కేటాయించాలని, సహకార సంఘాల ఆదాయ పన్ను, టీటీఎస్ వసూళ్ల నుంచి రాయితీ కల్పించాలని, ఎన్‌సీటీసీ ద్వారా ఐసీటీపీ తదితర పథకాలకు న్యాయమైన వడ్డీ విధించాల్సిందిగా కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా, సహకార సంఘాల ఉత్పత్తులు, సేవలకు విధించిన జీఎస్టీ నుంచి రాయితీ కోరినట్లు తెలిపారు. విద్యాలక్ష్మి, సూర్యాగర్, ఎమ్మెస్ఎంఈ పథకాల్లో సహకార సంఘాల సభ్యులకు సబ్సిడీతో కూడిన రుణం ఇవ్వాలని, 23 సహకార అభివృద్ధి శిక్షణ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు నిధులు కోరినట్లు మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. ఢిల్లీ వెళ్లిన మంత్రితో పాటు రాష్ట్ర సహకార, ఆహార, పౌరసరఫరాల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డా.జె.రాధాకృష్ణన్, సహకార సంఘాల రిజిస్ట్రార్ డా.ఎన్. సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కేరళలో రోడ్డు ప్రమాదం.. ఐదుగురు తమిళుల మృతి

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూలిపనుల కోసం కేరళ రాష్ట్రానికి వెళ్లిన ఐదుగురు తమిళులు మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పాల్గాట్‌లోని గోవిందపురానికి చెందిన కొందరు కార్మికులు తమ కుటుంబాలతో కలసి తిరుచూర్ ప్రాంతంలోని నాటిక అనే స్థలంలో రోడ్డు పక్కన టెంట్లు వేసుకొని నివసిస్తూ, కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే వారు సోమవారం రాత్రి ఫుట్‌పాత్‌పై వేసిన టెంట్ల వద్ద ఆదమరచి నిద్రపోతున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కన్నూర్ నుంచి కొచ్చిన్‌కు దుంగల లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ అదుపుతప్పి కార్మికుల టెంట్లపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పిల్లల సహా ఐదుగురు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. సమాచారం తెలిసి అక్కడకు వెళ్లిన పోలీసులు విచారణ చేపట్టగా... మృతులు కాళియప్పన్ (50), నాగమ్మ (39), కాళి (20), జీవన్ (4), విశ్వ (1) పాల్గాట్‌లో నివసించే తమిళులని తెలిసింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నూతన భవనాలు

● వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన సీఎం స్టాలిన్


సబ్ రిజిస్ట్రార్ భవనాలను ప్రారంభిస్తున్న సీఎం

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ఆధ్వర్యంలో రూ.30.27 కోట్లతో నిర్మించిన 17 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యాలయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఏవీ వేలు, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, పి.మూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, వాణిజ్య పన్నులు రిజిస్ట్రేషన్‌ల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రజేంద్ర నవనీత్, రిజిస్ట్రేషన్ల శాఖ చైర్మన్ దినేష్ పొన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో కొత్తనిర్మాణాలు, వసతులు...

సచివాలయంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరొక కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని ధర్మపురి, నామక్కల్, తిరుప్పూరు, కన్నియాకుమారి, ఈరోడ్, తిరువారూరు జిల్లాల్లో రూ.27.34 కోట్లతో 7 పర్యాటక ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలు, సదుపాయాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతం వద్ద రూ.17.57 కోట్లతో నిర్మించిన ఆర్చి, మరుగుదొడ్లు, టికెట్ కౌంటర్, రెస్టారెంట్, బోట్‌హౌస్, వ్యూపాయింట్, స్నానపు గదులకు ప్రారంభోత్సవం చేశారు. ఇదే విధంగా వత్తలమలై ప్రాంతంలో రూ.2.23 కోట్లతో నిర్మించిన రోడ్డు, వాహనాల పార్కింగ్, రెస్టారెంట్‌ను కూడా ప్రారంభించారు. కన్నియాకుమారి జిల్లా ముట్టం తీరం లో సందర్శకుల వీక్షణ స్థలం, చిన్నారుల క్రీడా మైదానం, సెంట్రల్ ప్లాజా, టికెట్ కౌంటర్ సెంటర్, శిల్పాలకు, ఈరోడ్ జిల్లా అందియూరు చెరువు వద్ద రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన కాలిబాట, బోట్‌హౌస్, తిరువారూరు జిల్లా మన్నార్‌గుడి, మరమ్మతు చేసిన హరిద్రా నది ఆలయ కొలనుకు స్టాలిన్ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, ఎస్. ముత్తుసామి, సామినాథన్, రాజేంద్రన్, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పర్యాటక, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి పి.చంద్రమోహన్, పర్యాటక శాఖ సంచాలకులు శిల్పా ప్రభాకర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొందాం

● భారీ వర్షాలపై సీఎం సమీక్ష ● అధికారులకు ఆదేశాలు జారీ

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా మారే అవకాశముందని భారత వాతావరణ పరిశోధన మండలి హెచ్చరించడంతో ఆరు జిల్లాల కలెక్టర్లతో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. చెన్నై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మైలాడుదురై, విల్లుపురం, నాగపట్టినం, తిరువారూరు, తంజావూరు, కడలూరు జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. వర్షబాధిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, వర్షాలు కురిసిన తర్వాత వరద బాధితులకు అందజేయాల్సిన సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఆరు జిల్లాల్లో వర్షబాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ శాఖలతో కూడిన జోనల్ కమిటీలను ఏర్పాటుచేయాలని, వైద్య బృందాలను సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు.



ఇప్పటికే తమ జిల్లాల్లో వరద ముందస్తు చర్యలను చేపట్టామని కలెక్టర్లు ముఖ్యమంత్రికి తెలిపారు. అదే విధంగా జాతీయ విపత్తుల సహాయక బృందాలను స్వచ్ఛంద సంస్థల సహకారంతో వరద బాధితులకు సాయమందించేందుకు సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగమంతా సిద్ధంగా వుండాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, వైద్య ప్రజారోగ్య శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు, రెవెన్యూ శాఖ కమిషనర్ రాజేష్ లఖానీ తదితరులు పాల్గొన్నారు.

వారంలో 3 రోజులు సచివాలయానికి రావాల్సిందే

● అమాత్యులకు స్టాలిన్ ఆదేశం

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ సభ్యులంతా ప్రజలకు, తమ శాఖాధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ఆ మేరకు వారంలో మూడు రోజులు తప్పకుండా సచివాలయానికి రావాల్సిందేనని ముఖ్యమంత్రి స్టాలిన్ తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రులు అన్నివర్గాలకు అందుబాటులో వుండాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని తాను, ఉపముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని, అదే సమయంలో మంత్రులు కూడా తమకు కేటాయించిన జిల్లాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం మళ్లీ తన సహచరులను ఆదేశించినట్లు సమాచారం. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఎల్లప్పుడూ సచివాలయానికి ప్రజలు వచ్చేవారని, ప్రస్తుతం వచ్చేవారి సంఖ్య తగ్గిందన్న సీఎం.. ఇకపై మంత్రులందరూ వారానికి మూడు రోజులు తప్పనిసరిగా సచివాలయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం.

నేడు ఊటీకి రాష్ట్రపతి


● నీలగిరి జిల్లాలో పటిష్ఠమైన పోలీసు భద్రత
● ఆరు రోజుల పాటు డ్రోన్ల నిషేధం


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ కార్యాక్రమాల్లో పాల్గొనేందుకు నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రాష్ట్రానికి రానున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కోయంబత్తూర్ లోని సూలూరు వైమానికదళానికి చేరుకోనున్న రాష్ట్రపతి.. అక్కడి నుంచి సైనిక హెలికాప్టర్‌లో నీలగిరి జిల్లా ఊటీ వెళ్లి అక్కడ రాజ్‌భవన్‌లో బసచేస్తారు. గురువారం రోడ్డు మార్గంలో రాష్ట్రపతి కున్నూరు వెల్లింగ్టన్‌లో సైనిక శిక్షణ కళాశాలకు వెళతారు. అక్కడ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తారు. అనంతరం ఆ శిక్షణ కేంద్రంలో రాష్ట్రపతి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమం అనంతరం మళ్లీ ఊటీ రాజ్‌భవన్ చేరుకుంటారు. 29వ తేది రాజ్‌భవన్‌లో విశ్రాంతి తీసుకొని, 30వ తేది ఉదయం హెలికాప్టర్‌లో కోయంబత్తూర్ సూలూరు వైమానికదళానికి చేరుకుంటారు. అక్కడి నుంచి తిరువారూరు కేంద్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొంటారు. ఈ కార్యక్రమం అనంతరం తిరుచ్చి విమానాశ్రయం చేరుకొని ఢిల్లీ వెళ్తారు.

1,000 మంది పోలీసులతో బందోబస్తు ...

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనను పురస్కరించుకొని నీలగిరి జిల్లా వ్యాప్తంగా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కృష్ణగిరి తదితర జిల్లాలకు చెందిన 1,000 మందికి పైగా పోలీసులు మంగళవారం నీలగిరి చేరుకున్నారు. మరోవైపు నీలగిరి జిల్లాకు పలు ప్రాంతాల నుంచి వెళ్లే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. తీటుకల్ హెలిప్యాడ్ ప్రాంతాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సోమవారం నుంచి ఆరు రోజులు నీలగిరి జిల్లాలో డ్రోన్ల సంచారంపై నిషేధం విధించారు.



సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా న్యూ వాషర్‌మెన్‌పేట పరిధిలోని నార్త్ టెర్మినల్ రోడ్డు, టీహెచ్ రోడ్డు, డీడీర్ నగర్, చెరియన్ నగర్, సుడలైముత్తు వీధి, అశోక్ నగర్, దేసియన్ నగర్, నమ్మయ్య మేస్త్రి వీధి, పచ్చమ్మాళ్ వీధి, నాగూరన్ గార్డన్, బాలకృష్ణన్ వీధి, షిపింగ్ హార్బర్, ధనపాల్ నగర్, వెంకటేశన్ అలి వీధి, వీరరాఘవన్ వీధి, ఎరుసప్ప మేస్త్రి వీధి, వత్తవాడై వీధి, గాంధీ వీధి, వరదరాజన్ వీధి, మేట్టు వీధి, గ్రామ వీధి, క్రాస్ రోడ్డు, శివన్ నగర్, మంగమ్మాళ్ గార్డన్, జీవా నగర్, ఎంపీటీ క్వార్టర్స్, ఏఈ ఆలయ వీధి, చేపాక్కం పరిధిలో బాలాజి గార్డన్, బైపాస్ రోడ్డు, ఆన్ ఉల్లాస సిటీ, శాంతి కాలని ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పరిశోధక విద్యార్థులకు ఉపకారవేతనం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో పూర్తికాల పీహెచ్‌డీ పరిశోధన విద్యార్థులకు రెండేళ్లపాటు నెలకు రూ.1,000 ఉపకారవేతనం, ఇతర ఖర్చులకు రూ.30,000 తమిళనాడు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎన్‌ఎస్సీసీటీ) అందజేస్తోంది. పరిశోధన విద్యార్థులు గుర్తింపు పొందిన జర్నల్స్‌లో కనీసం 2 పరిశోధన పత్రాలు సమర్పించి ఉండాలి. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.tanscst.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చని టీఎన్‌ఎస్సీసీటీ మెంబర్ సెక్రటరీ విన్సెంట్ ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగులకు ఆన్‌లైన్‌లో రాయితీ కార్డులు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణించే దివ్యాంగులకు 25 శాతం 50 శాతం వరకు టిక్కెట్టు ధరలో రాయితీ పొందవచ్చు. అందుకోసం వారు ట్రావెల్ కన్సెషన్ కార్డులు పొందాల్సి ఉంది. దక్షిణ రైల్వే పరిధిలో చెన్నై, తిరుచ్చి, సేలం, మదురై, పాలక్కాడు, తిరువనంతపురం తదితర ఆరు ప్రాంతీయ కార్యాలయాలను దివ్యాంగులు సంప్రదించి, తగిన సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకొని కార్డు పొందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, దివ్యాంగుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో ఈ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే సదుపాయం కల్పించారు. దివ్యాంగులు https://divyangjanid.indianrail.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా సంబంధిత సర్టిఫికెట్లతో పాటు దరఖాస్తు సమర్పించవచ్చు. ముందస్తు రిజర్వేషన్లలో కూడా ఈ కార్డు వినియోగించి రాయితీ పొందవచ్చని అధికారులు తెలిపారు.

4న ఘంటసాల జయంతి

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం, జనని సాంఘిక సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 4వ తేదీ అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి జరుగనుంది. పెరంబూరులోని డీఆర్‌బీసీసీసీ మహోన్నత పాఠశాలలో సాయంత్రం జరుగనున్న ఈ కార్యక్రమం నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనతో ప్రారంభం కానుండగా, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతం పలుకనున్నారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేలు అధ్యక్షత వహించనుండగా, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు, రెప్కో బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య, గాయకులు ఎంఆర్ సుబ్రహ్మణ్యం, ఆకాశవాణి చెన్నై కేంద్రం నిర్వాహకులు పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మీ ప్రసంగించనున్నారు. సాంస్కృతిక సంఘం కార్యదర్శి పీఆర్ కేశవులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంఆర్ సుబ్రహ్మణ్య బృందం సంగీత విభావరి జరుగనుంది. కార్యక్రమానికి అందరూఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎం విల్లుపురం పర్యటన రద్దు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా విల్లుపురం జిల్లాలో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటన రద్దయింది. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు ప్రజలకు అందుతున్నాయా, పథకాల అమలులో అధికారుల పనితీరు తదితరాలు తెలుసుకొనేందుకు ముఖ్యమంత్రి అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలిస్తున్నారు. ఆ ప్రకారం, ఈ నెల 28,29 తేదీల్లో విల్లుపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారని సచివాలయం ఇదివరకే ప్రకటించింది. ప్రస్తుతం వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి విల్లుపురం జిల్లా పర్యటన రద్దయిందని అధికారులు తెలిపారు.

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల్లో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ తదితర కేంద్ర విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ కోర్సులు చేస్తున్న రాష్ట్ర విద్యార్థులు ఉపకారవేతనం పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, బీసీ, ఎంబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు తలా రూ.2 లక్షలు ఆర్థికసాయం అందజేయనుంది. విద్యార్థులు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని బీసీ, మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు తాము చదువుతున్న విద్యాసంస్థల ద్వారా రెన్యువల్‌కు డిసెంబరు 15, కొత్తగా ఉపకారవేతనం పొందేందుకు 2025 జనవరి 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

సీఎం వ్యాఖ్యలపై పీఎంకే ఆగ్రహం

పలు ప్రాంతాల్లో కార్యకర్తల ధర్నాలు



చిదంబరం, తంజావూరులో ఆందోళన చేస్తున్న పీఎంకే కార్యకర్తలు

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌కు మరో పనిలేదంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలపై పీఎంకే శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. పైగా ఆ పార్టీకి బాగా పట్టున్న ప్రాంతాల్లో సీఎంకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులోభాగంగా, మంగళవారం గుమ్మిడిపూండి, చెన్నై, కడలూరు, విరుదాచలం, చిదంబరం, తాంబరం, తిరుపూరు తదితర ప్రాంతాల్లో పీఎంకే కార్యకర్తలు ధర్నాలు చేశారు. చిదంబరంలో జరిగిన ఆందోళనలో కొందరు ఒక ప్రైవేటు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ధర్నాలో పాల్గొన్న ఆరుగురు మహిళలు సహా 177 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

● మహిళా కానిస్టేబుల్ సహా నలుగురి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోయిల్‌లో శంకర నారాయణస్వామి ఆలయ హుండీలో చోరీకి పాల్పడిన మహిళా కానిస్టేబుల్ సహా నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దక్షిణ జిల్లాల్లో పేరుగాంచిన శంకర నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హుండీలో భక్తులు చెల్లించే కానుకలను ప్రతినెలా స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు లెక్కిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల హుండి ఆదాయం లెక్కింపు సోమవారం జరిగింది. ఆలయ అధికారులు సీసీ కెమెరాల ద్వారా లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు. హుండీ లెక్కింపులో పాల్గొన్న తూత్తుకుడి తెన్‌బాగం పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ మహేశ్వరి, ఆమెతో వెళ్లిన ముత్తులక్ష్మి, మారియమ్మాళ్, అనిత తదితరులు హుండీలో నగదు తమ లో దుస్తుల్లో దాచుకొనే దృశ్యాలు నమోదయ్యాయి. దీనికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

చెన్నైలో సీబీఐ తనిఖీలు

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో మూడు ప్రాంతాల్లో సీబీఐ తనిఖీలు చేపట్టింది. నగరానికి చెందిన పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ యజమానులు, కేంద్ర రాష్ట్రాలకు చెందిన మాజీ ఉన్నతాధికారుల గృహాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. రాయపేటలో ఉన్న ఒక కంపెనీ మేనేజర్ శేఖర్ నివాసంలో, మైలాపూర్‌లోని హార్బర్ మాజీ జాయింట్ డైరెక్టర్ పుగళేంది, అయ్యప్పాక్కంలో ఉన్న రియల్ ఎస్టేట్ యజమాని షణ్ముగం నివాసాల్లో సీబీఐ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల సమయంలో నగర పోలీసులు ఆయా ఇళ్ల వద్ద బందోబస్తు కల్పించారు.

12 సవర్ల నగలు, వస్తువుల దోపిడీ

వేలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కనియంబాడి ప్రాంతంలో మురుగన్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడిన అగంతకులు నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులు దోచుకొని పరారయ్యారు. సోమవారం రాత్రి మురుగన్ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి, మంగళవారం ఉదయం ఇంటికి రాగా తలుపులు బద్దలు కొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరులోని 12 సవర్ల నగదు, ఎలక్ట్రికల్ వస్తువులు కనిపించకపోవడంతో, కనియంబాడి పోలీసులకు ఫిర్యాదుచేశారు, వారు కేసు నమోదుచేసి అగంతకుల కోసం గాలిస్తున్నారు.

పఠనా నైపుణ్యం పెంచేందుకు 'యంగ్ రీడర్'

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠనా నైపుణ్యం పెంచేలా 'యంగ్ రీడర్' ప్రాజెక్ట్ తిరువళ్లూర్ జిల్లాలో ప్రారంభమైంది. కలెక్టరేట్ ప్రాంగణంలోని గ్రంథాలయంలో ఈ ప్రాజెక్ట్‌ను జిల్లా కలెక్టర్ ప్రభు శంకర్ సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి 6-8 తరగతులకు చెందిన విద్యార్థుల పఠనా నైపుణ్యం పెంచేలా ఈ ప్రాజెక్ట్ ప్రారంభించామని, ప్రతిరోజు రెండు పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులను ఈ గ్రంథాలయానికి తీసుకొచ్చి పుస్తకాలు చదివించనున్నామని అధికారులు తెలిపారు.

జనవరిలో 'బాక్సింగ్ ఎరీనా' ప్రారంభం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే తొలి బాక్సింగ్ ఎరీనా 2025లో జనవరిలో ప్రారంభం కానుంది. అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యం అందించేలా రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ చర్యలు చేపడుతోంది. ఆ క్రమంలో గోపాలపురంలో రూ.7.79 కోట్లతో అధునాతన వసతులతో బాక్సింగ్ ఎరీనా నిర్మాణం 2023లో ప్రారంభించారు. 1,000 సీట్ల గ్యాలరీతో కూడిన రెండు బాక్సింగ్ రింగులు, ప్రత్యేక ఎన్‌క్లోజర్, మాజీ బాక్సింగ్ ఛాంపియన్ల ఫొటోలతో వ్యాయామశాల సహా పలు వసతులు ఈ కేంద్రంలో సమకూర్చనున్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలు నిర్వహించేలా నిర్మిస్తున్న ఈ కేంద్రం జనవరిలో అందుబాటులోకి వస్తుందని క్రీడాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.

12న సీఐటీయూ ఆందోళన

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలు, రవాణా శాఖ మాజీ కార్మికులకు డీఏ పెంపు సహా పలు డిమాండ్లతో డిసెంబరు 12వ తేది సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ సంఘం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ఎన్నికల హామీల్లో ఒకటైన పాత పింఛన్ విధానం అమలుపై ఎలాంటి సమాధానం లేదన్నారు. తమ కోర్కెల సాధనకు డిసెంబరు 12వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పల్లవన్ సాలైలో ఆందోళన చేపట్టనున్నట్లు, ఈ ఆందోళనల్లో కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.

వచ్చే ఏడాదికి ఎయిమ్స్ పనులు పూర్తి

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిమ్స్ ఆస్పత్రి 2025 డిసెంబరు నుంచి పనిచేస్తుందని మదురై ఎయిమ్స్ నిర్వహణ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. రామనాథపురంలోని ఓ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... మదురై ఎయిమ్స్ నిర్మాణపనులు వేగవంతం చేశామన్నారు. వైద్యకళాశాల, విద్యార్థుల హాస్టల్స్, ఔట్ పేషంట్ల విభాగం, నిర్దీత వ్యాధుల ఇన్‌పేషంట్ల విభాగం తదితర భవన నిర్మాణాలు పూర్తిచేసి 2025 డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. మిగిలిన పనులు 15 నెలల్లో పూర్తిచేసి, మదురై ఎయిమ్స్ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నామని ఆ సంస్థ నిర్వహణ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు.

జిల్లాలో తొలిసారి ఆఫ్రికన్ చెట్ల విత్తనాలు



విత్తనాలు నాటుతున్న దినేష్ శరవణన్

వేలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిసారిగా ఆఫ్రికన్ బావోబాబ్ రకం చెట్ల విత్తనాలు నాటినట్లు రంగాపురానికి చెందిన సమాజ సేవకుడు, ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ .. చెట్లలో ప్రధాన వృక్షమైన ఆఫ్రికన్ బావోబాబ్ వేసవిలో కూడా ఏపుగా పెరిగే గుణం కలిగి ఉందన్నారు. ఆఫ్రికా అడవుల్లో ఈ వృక్షాన్ని అడవుల రాజుగా పిలుస్తుంటారని, ఈ రకం చెట్లు అంతరించిపోయే జాబితాలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో ఈ చెట్లు ఉండగా, తొలిసారిగా జిల్లాలో 20 విత్తనాలు చల్లినట్లు తెలిపారు. అందుకు సహకరించిన జిల్లా క్రీడాధికారి బాలమురుగన్, విత్తనాలుఅందజేసిన కళ్లకుర్చికి చెందిన సత్యమూర్తికి దినేష్ శరవణన్ కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రిని కించపరచడం తప్పే

● కేసు విచారణ ఎదుర్కోవాల్సిందే

● మాజీ మంత్రి షణ్ముగంకు తేల్చిచెప్పిన సుప్రీం

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిని కించపరిచేలా, అగౌరవపరిచేలా మాట్లాడటం తప్పేనని, అందువల్ల ఈ కేసు విచారణ ఎదుర్కోవాల్సిందేనంటూ అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సీవీ షణ్ముగంకు సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కొత్త కార్మిక చట్టం ప్రకారం 12 గంటల పని, వలస కార్మికులను వారి స్వరాష్ట్రాలకు పంపించడం, గంజాయి రవాణా, మద్యం విక్రయాలకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో గతంలో ఆందోళన జరిగింది. అందులో పాల్గొన్న సీవీ షణ్ముగం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేశారు. దీనిపై డీఎంకే నేతలు పరువు నష్టం కేసు దాఖలు చేయగా, జిల్లా కోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే విధించింది. అదేసమయంలో కేసు రద్దు చేయాలని కోరుతూ సీవీ షణ్ముగం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దీనిపై అపెక్స్ కోర్టులో విచారణ సాగుతుంది. ఈ నేపథ్యంలో సీఎంపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ కోరుతూ, తన ప్రమాణ పత్రాన్ని కోర్టుకు సమర్పించాలని సెప్టెంబరు నెల 23న సుప్రీంకోర్టు ఆదేశించింది. పైగా జిల్లా కోర్టు విచారణపై సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ మంగళవారం న్యాయమూర్తులు సుధన్షు తులియా, అజానుద్దీన్ అమనుల్లాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా, కించపరిచేలా మాట్లాడటం ఎంతవరకు సబబు? ఈ కేసు అంశంలో జిల్లా కోర్టు విచారణపై విధించిన స్టే ఎందుకు తొలగించ కూడదు? అసత్య ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేయడం సహజమే కదా? అందువల్ల ఈ కేసు విచారణను సీవీ షణ్ముగం ఎదుర్కోవాల్సిందే అంటూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేస్తూ, తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది.

టీవీకే సభ్యత్వ నమోదుపై సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న దాహిరాభాను

వేలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం కల్పుదూర్ గ్రామంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలో సభ్యుల చేరికకు సంబంధించిన సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దాహిరాభాను పాల్గొని, పార్టీలో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాట్పాడి, కేవీ కుప్పం నియోజకవర్గాల బాధ్యులు నవీన్ సహా 1,000 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద మందికి దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం నడుపేటలో ఉన్న ఓ కల్యా ణ మండపంలో మంగ ళవారం ది వ్యాంగులు, హి జ్రాలు సహా వంద మందికి ఉచిత దుప్పట్లు అందజేసే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రాజేంద్రన్ అధ్యక్షత వహించగా, భాగ్యరాజ్, నిర్వాహకులు బాలాజీ శశికుమార్, కలైఅరసన్, ముత్తురామన్, రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.58 కోట్లు



తిరుత్తణి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.58కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. స్వామివారిని దర్శించే భక్త లు కానుకలు సమర్పిస్తుంటారు. ఆ ప్రకారం, ఆలయ ప్రాంగణంలోని హుండీల లెక్కింపు ఇటీవల నిర్వహించారు. రూ.1,58,47,551 నగ దు, 776 గ్రాముల బంగారం, 9,870 గ్రాముల వెండి ఆభరణాలు కానుకగా సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు.

వీసీల నియామకంలో గవర్నర్ జోక్యం తగదు

● ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించడంలో గవర్నర్ జోక్యం చేసుకోరాదని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ అభిప్రాయపడ్డారు. మదురైలోని మీనాక్షి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు జనరల్ కౌన్సెలింగ్‌ను మంగళవారం మంత్రి చెళియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో ప్రొఫెసర్లు, టెక్నీషియన్ల బదిలీ పారదర్శకంగా ఉంటుందన్నారు. వీసీల నియామకంలో గవర్నర్ జోక్యం చేసుకోవడం సరికాదని, మంత్రి వ్యాఖ్యానించారు.

24 గంటల పాటు ఆవిన్ పార్లర్లు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ప్రజల సౌకర్యార్థం ఆవిన్ పార్లర్లు 24 గంటలు పనిచేయనున్నాయి. ఈ మేరకు ఆవిన్ విడుదల చేసిన ప్రకటనలో... అంబత్తూర్ పాల డిపో గేటు పార్లర్, అన్నానగర్ టవర్ పార్క్ పార్లర్, మాధవరం డిపో పార్లర్, వన్నాన్‌దురై పార్లర్, బీసెంట్ నగర్ పార్లర్, షోలింగనల్లూర్ డిపో పార్లర్, విరుగంబాక్కం పార్లర్ (వలసరవాక్కం మెగా మార్ట్ సమీపం), మైలాపూర్ సీపీ రామస్వామి రోడ్డు పార్లర్లు 24 గంటలు పనిచేస్తాయని ఆవిన్ తెలియజేసింది.

బేసిన్ బ్రిడ్జి రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ ప్రారంభం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బేసిన్ బ్రిడ్జి రైల్వేస్టేషన్‌లో నాలుగేళ్ల అనంతరం పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 2020లో ఒప్పందదారుల ఎంపిక చేయడంలో ఏర్పడిన జాప్యం కారణంగా ఈ పార్కింగ్ మూతపడింది. ఒప్పందదారుల ఎంపిక పూర్తికావడంతో సోమవారం నుంచి పార్కింగ్ అందుబాటులోకి వచ్చింది.

పెరిగిన కోడిగుడ్డు ధర

వేళచ్చేరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ మండలంలో నాలుగు రోజులుగా రోజుకు 5 పైసలు చొప్పున కోడిగుడ్డు ధర పెరిగింది. ఈ విషయమై నామక్కల్ మండల కోడిగుడ్ల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సింగరాజ్ మాట్లాడుతూ.. ఇతర మండలాల్లో కోడిగుడ్డు ధర పెంచిన దృష్ట్యా నామక్కల్ మండలంలో కూడా పెంచామన్నారు.

మహిళలు, చిన్నారులపై వేధింపులు సహించం

● వారి భద్రతలో రాష్ట్రం ముందంజ

● నటుడు విజయ్‌కు మంత్రి గీతాజీవన్ కౌంటర్

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలను ఈ ప్రభుత్వం సహించదని, దేశంలోనే మహిళలకు భద్రత కల్పించడంలో రాష్ట్రం ముందంజలో ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు వ్యతిరేకంగా వేధింపులు అధికమవుతున్నాయని టీవీకే అధ్యక్షుడు విజయ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దానిపై మంత్రి స్పందిస్తూ... మహిళలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా తమ పనులు చేసుకొనే పరిస్థితి రాష్ట్రంలో ఉందని, ఉన్నత విద్య అభ్యసిస్తున్న, ఉద్యోగాలు చేస్తున్న, స్వీయ మర్యాదతో రాష్ట్ర మహిళలున్నారన్నారు. దేశంలోని ఉత్పత్తుల రంగంలో 43 శాతం మంది రాష్ట్ర మహిళలు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రం లో 241 మహిళా పోలీసుస్టేషన్లు, 32 కిడ్నాపింగ్ నిరోధక యూనిట్లు, 7 దర్యాప్తు బృందాలు, 43 పిల్లల వేధింపుల నిరోధక బృందాలు, 39 స్పెషల్ జువైనల్ పోలీసు యూనిట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. మైనర్లపై జరిగే నేరాలు పరిష్కరించేలా రాష్ట్రంలోని అన్ని మహిళా పోలీస్‌స్టేషన్‌లలో 194 జువైనల్ ఫెండ్లీ సెల్స్, 1,542 చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారులు పనిచేస్తున్నారన్నారు. అలాగే, మహిళలు ఫిర్యాదు చేసేలా 'కావల్ ఉదవి' యాప్, 181, చిన్నారుల కోసం 1098 అనే నెంబర్లు పనిచేస్తున్నాయన్నారు. జాతీయ నేరాల కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో... 2022లో మహిళలకు వ్యతిరేకంగా జరిగిన నేరాలు దేశవ్యాప్తంగా 1.65 లక్షలు కాగా, రాష్ట్రం లో 24 మాత్రమే జరిగినట్లు తెలిసిందన్నారు. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గీతాజీవన్ తెలిపారు.



మంత్రి గీతాజీవన్

ఇల్లు అప్పగించడంలో 11 ఏళ్ల జాప్యం

● రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఫోరం ఆదేశం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిర్దీత వ్యవధిలో ఇల్లు అప్పగించని రియల్ ఎస్టేట్ సంస్థ, రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలంటూ రియల్ ఎస్టేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీచేసింది. పాత మహాబలిపురం రోడ్డు కేళంబాక్కంలో అక్షయ సంస్థ ఆధ్వర్యంలో 'టుడే' అనే పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. ఈ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు అవినాష్ పార్థసారథి 2013లో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇంటి కొనుగోలు రూ.39.98 లక్షలను పలు వాయిదాలుగా చెల్లించాడు. ఒప్పందం ప్రకారం, 2016 జూలైలో ఇంటిని ఆ సంస్థ అప్పగించాల్సి ఉండగా, 2023 వరకు అప్పగించలేదు. దీంతో, అవినాష్ తరపున ఆయన ఏజెంట్ రియల్ ఎస్టేట్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన కమిషన్ విచారణ అధికారి ఎస్.ఉమామహేశ్వరి, ఒప్పందం ప్రకారం, సదరు సంస్థ ఇంటికి అప్పగించడంలో 11 ఏళ్ల జాప్యం జరిగిందని, దీంతో మనస్తాపానికి గురైన లబ్దిదారుడికి రూ.5 లక్షలు, కేసు ఖర్చులకు రూ.50,000లు 90 రోజుల్లో చెల్లించాలని ఉత్తర్వులు జారీచేశారు.

భర్తపై కాగుతున్న నూనె పోసిన భార్య

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన చోమంగళంలో మద్యం తాగి వచ్చి రచ్చ చేసిన భర్తపై భార్య సలసల కాగే నూనె పోసింది. దీంతో భర్తకు గాయాలవడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చోమంగళం సమీపంలోని పుదునల్లూరు ప్రాంతంలో రవి (45), జయంతి (40) అనే దంపతులున్నారు. రవికి మద్యం అలవాటుంది. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ పీలక వరకు మద్యం సేవించి ఇంటికి వచ్చిన రవి భార్యను వేధించాడు. దీంతో నిగ్రహం కోల్పోయిన ఆమె... బాగా కాగిన నూనె భర్తపై పోసింది. దీంతో రవికి తీవ్ర గాయాలవడంతో కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి జయంతిని అరెస్టు చేశారు.

బ్యూటీషియన్‌ను మోసగించిన ఎన్ఆర్ఐ

● నగలతో ఉడాయించిన సింగపూర్ వరుడు

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం ఆర్కాడు వీధికి చెందిన ప్రియ (36) అనే బ్యూటీషియన్‌ను రెండో వివాహం చేసుకుంటానని నమ్మించి 50 సవర్ల నగలతో ఉడాయించిన సింగపూర్ వరుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 2012లో వివాహం చేసుకున్న ప్రియకు 12 ఏళ్ల కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా భర్త నుంచి ఆమె విడాకులు తీసుకున్నారు. ఇందువల్ల రెండో వివాహం చేసుకొనేందుకు ప్రియ ఓ మ్యారేజ్ బ్యూరోలో పేరు నమోదుచేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఈ సమాచారం చూసిన సింగపూర్‌కు చెందిన కృష్ణమూర్తి ఆమెను సంప్రదించి వివాహం చేసుకుంటానని హామీఇచ్చాడు. దీంతో గత ఆగస్టులో జరిగిన నిశ్చితార్థానికి ప్రియ రూ.5 లక్షలు ఖర్చుచేసినట్లు సమాచారం. ఆ తర్వాత వరకట్నంగా డిమాండ్ చేసిన 250 సవర్లలో ముందుగా 50 సవర్ల నగలను ప్రియ నుంచి తీసుకున్న కృష్ణమూర్తి సింగపూర్‌కు వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ రాలేదు. అదే సమయంలో అతడి సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో మోసపోయానని గ్రహించిన ప్రియ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసుకున్న వలసరవాక్కం పోలీసులు, సింగపూర్ వరుడిని అరెస్ట్‌చేసే ప్రయత్నాల్లో దిగారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి నాజర్, కలెక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు

తిరుత్తణి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి పాత తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని రూ.1.63 కోట్లతో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం చెన్నై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుత్తణి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి నాజర్, జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు పాల్గొన్నారు. . కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు తిరుత్తణి ఎం.భూపతి, నగర పంచాయతీ అధ్యక్షురాలు సరస్వతి భూపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే నిర్బంధ వీఆర్ఎస్

● హెచ్చరించిన పాఠశాల విద్యాశాఖ

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఉపాధ్యాయులతో నిర్బంధ పదవీ విరమణ (వీఆర్ఎస్) చేయిస్తామని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పళనిస్వామి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో పనిచేసే బోధనా, బోధనేతర సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్లు విద్యార్థినుల పట్ల పాటించాల్సిన మార్గదర్శకాలతో కూడిన జాబితాను రూపొందించి ఆయా పాఠశాలలకు పంపించారు. పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు శిక్ష విధింపు, నిర్బంధ పదవీ విరమణ, ఉద్యోగం నుంచి తొలగింపు, వారి విద్యార్హత సర్టిఫికెట్లను రద్దు చేయడం వంటి కఠిన చర్యలను తీసుకునేలా మార్గదర్శకాలను స్పష్టంగా వివరించామన్నారు. ఉపాధ్యాయులతోపాటు బోధనేతర, పాఠశాల కరస్పాండెంట్లు విధిగా పాటించాలని ఆయన సూచించారు.

వృద్ధులకు ఆధ్యాత్మిక యాత్ర

● ప్రారంభించిన మంత్రి శేఖర్ బాబు

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ఆధ్యాత్మిక యాత్రను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా సైదాపేట కందకోట ముత్తుకుమారస్వామి ఆలయం నుంచి 200 మంది వృద్ధులతో ఆధ్యాత్మిక యాత్రను రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, వృద్ధుల కోసం ఈ ఆరుపడై ఆధ్యాత్మిక యాత్రను జనవరి 28వ తేదీ ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 5 దపాలుగా 1008 మంది వృద్ధులు ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లారన్నారు. ఇపుడు మరో 200 మంది ఈ యాత్రకు వెళ్లారన్నారు. వీరిలో చెన్నై జోన్ నుంచి 90 మంది, కాంచీపురం జోన్ నుంచి 60 మంది, వేలూరు నుంచి 50 మంది వెళ్లారన్నారు. 2025 మార్చి నాటికి 1008 మంది వృద్ధులను ఈ యాత్రకు పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1.58 కోట్లను కేటాయించిందని వెల్లడించారు. కాగా, ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, అదనపు కమిషనర్ సుకుమార్, సహాయ కమిషనర్లు లక్ష్మణన్, జయరామన్, ముల్లై తదితరుల పాల్గొన్నారు.

మరైమలై మనవరాలికి రూ.లక్ష సాయం

● ఈపీఎస్ వెల్లడి

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో మగ్గుతున్న తమిళ పండితుడిగా గుర్తింపుపొందిన మరైమలై అడిగలార్ మనవరాలికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేయనున్నట్టు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళ పండితుడు మరైమలై అడిగలార్ మనవరాలు లలిత పేదరికంలో మగ్గుతున్నట్టు తెలిసిందని, ఆమెను ఆదుకునేందుకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

శ్రీపెరుంబుదూర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి

● ఎంపీ బాలు

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లో వంద పడకలతో ఈఎస్ఐ ఆస్పత్రిని రూ.178 కోట్లతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని డీఎంకే ఎంపీ టీఆర్ బాలు పేర్కొన్నారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... శ్రీపెరుంబుదూర్, ఇరుంగాట్టుకోట ప్రాంతాల్లో వందల సంఖ్యలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున కోరగా, కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.


మడోన్నా సెబాస్టియన్

'ప్రేమమ్' చిత్రం ద్వారా అటు మలయాళం, ఇటు కోలీవుడ్ ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసుకుని, తమిళ చిత్రం 'పా.పాండి'లో ప్రతి ఒక్కరినీ అలరించి, 'లియో' సినిమాతో ఓ వెలుగు వెలిగి, అభిమానుల గుండెల్లో గూడుకట్టుకున్న హీరోయిన్ మడోన్నా సెబాస్టియన్. తాజాగా ప్రభుదేవా హీరోగా నటించిన 'జాలియో జింఖానా' చిత్రంలో నటించి మరోమారు కోలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

విజయ్.. ఓ సాహసి

మడోన్నా

? ప్రభుదేవాతో నటించిన అనుభవం ఎలా ఉంది.

! ఎలాంటి టెన్షన్ లేదు. మంచి మనసున్న వ్యక్తి ప్రభుదేవా. సినిమా మొత్తం ఆయనను ఒక చిన్న పిల్లాడిలా ఎత్తుకుని ప్రయాణించాం. సినిమా చూసిన వారికి ఈ విషయం తెలుస్తుంది.

? చాలా రోజుల తర్వాత ఒక కామెడీ చిత్రంలో నటించడానికి కారణం.

! నిజమే.. 'జాలియో జింఖానా' చిత్రం పూర్తి హాస్య భరితంగా సాగుతుంది. అనేక మంది ఆర్టిస్టులున్నారు. శక్తి చిదంబరం దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారు.

? కొన్ని చిత్రాల్లో నటించి కాస్త గ్యాప్ తీసుకోవడానికి కారణం.

! ఒక సినిమాకు కమిట్ అయితే, ఆ చిత్రంలో నా వంతు భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటాను. మంచి కథ, మంచి దర్శకుడు ఉండాలని ఆశిస్తాను. ఒకేసారి పలు చిత్రాల్లో నటించాలనే ఆశ లేదు.

? 'ప్రేమమ్' చిత్రంలో సాయిపల్లవితో కలిసి నటించారు. ఇపుడు సాయిపల్లవి టాప్ పొజిషన్‌లో ఉన్నారు. దీనిపై మీ కామెంట్స్.

! సహ నటిగా ఆమెపై నాకు అమితమైన గౌరవ మర్యాదలున్నాయి. ఆమె ఎదుగుదలను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది.

? మీరు మంచి గాయని కూడా. ప్రభుదేవా చిత్రంలో ఓ పాట పాడివుండొచ్చు కదా.

! నిజం చెప్పాలంటే ఆ చిత్రంలో ఒక పాట నేను పాడాల్సి వుంది. సమయం లేక అది సాధ్యపడలేదు. నటనపైనే దృష్టిసారించాలని దర్శకుడు అడ్వైజ్ చేశారు. సో.. అలా ఛాన్స్ మిస్ అయింది.

? విజయ్, విజయ్ సేతుపతి, ధనుష్ వంటి హీరోల నుంచి ఏం నేర్చుకున్నారు.

! ప్రతి ఒక్కరి వద్ద అన్యోన్యంగా మెలుగుతూ సెల్ఫీ ఎలా తీసుకుంటారో విజయ్ సేతుపతిని చూసి నేర్చుకున్నాను. విజయ్ డ్యాన్స్ సహజంగా చేస్తారు. స్టంట్స్‌లో అదే వేగం చూశాను. ఇది ఎంతో ఆశ్చర్యం కలిగించింది. నటుడిగా, దర్శకుడుగా ధనుష్‌గా చూసి భ్రమించిపోయాను.

? ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు.

! పాటలు పాడటం, బాక్సింగ్ నేర్చుకోవడం. ఏదో ఒక వ్యక్తిగత ప్రతిభ ఉండేలా ప్రయత్నిస్తాను. ఇది 'లియో' చిత్రంలో ఎంతగానో ఉపయోగపడింది.

? విజయ్‌తో కలిసి నటించారు. ఆయన రాజకీయ రంగ ప్రవేశంపై మీ అభిప్రాయం

! ఎంతో ధైర్యంతో తీసుకున్న నిర్ణయంగా భావిస్తాను. అందుకే ఆయనను ఓ సాహసిగా పేర్కొంటాను. రాజకీయాలు మహాసముద్రం వంటివి. ఆయనకు నా అభినందనలు.

చిత్రజ్యోతి


'జీబ్రా' సక్సెస్ వేడుకలు

'జీబ్రా'తో ఆ కోరిక నెరవేరింది — సత్యదేవ్

తమిళంలో ఒక చిత్రం చేయాలన్న కోరిక సుదీర్ఘకాలంగా ఉండేదని అది 'జీబ్రా'తో నెరవేరిందని హీరో సత్యదేవ్ అన్నారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో సత్యదేవ్ హీరోగా నటించిన 'జీబ్రా' తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో విడుదలై ఘన విజయం సాధించింది. దీనిని పురస్కరించుకుని చిత్రం సక్సెస్ వేడుకలను సోమవారం నగరంలో నిర్వహించారు. ఇందులో సత్యదేవ్ మాట్లాడుతూ, 'తమిళనాడుతో నాకు ప్రత్యేక అనుభవం ఉంది. తమిళ చిత్రాలంటే అమితమైన ఇష్టం. తమిళంలో సినిమా చేయాలన్న కోరిక ఈ సినిమాతో నెరవేరింది. 'జీబ్రా' విజయం వెనుక నటుడు సత్యరాజ్ వెన్నెముకగా నిలిచారు. దర్శకుడు ఈశ్వర్ 800 పేజీల స్క్రిప్టును తెరపై ఆవిష్కరించారు. రవి బస్రూర్ సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందన్నారు. సత్యరాజ్ మాట్లాడుతూ, 'ఈ స్థాయిలో విజయం సాధిస్తుందని ఊహించలేదు. హిందీలో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ప్రదర్శితమవుతుంది. సత్యదేవ్ తమిళం నేర్చుకుని డబ్బింగ్ చెప్పినట్టు వెల్లడించారు. నేను 15 యేళ్ళుగా తెలుగు చిత్రాల్లో నటిస్తున్నాను. కానీ, ఇప్పటికీ తెలుగు నేర్చుకోలేకపోతున్నా' అన్నారు. దర్శకుడు ఈశ్వర్ మాట్లాడుతూ, 'నా సినీ ప్రయాణం ఇక్కడ నుంచే ప్రారంభమైంది. ఇక్కడే అనేక చిత్రాల విజయోత్సవ వేడుకలు చూశాను. నా తొలి చిత్రం 'పెంగ్విన్' మిస్‌ఫైర్ అయింది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్న తీరు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది' అన్నారు. కాగా, సత్యదేవ్, డాలీ ధనుంజయ జంటగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రియా భవానీ శంకర్, జెనీఫర్, సత్య, సునీల్ తదితరులు నటించిన విషయం తెల్సిందే.

తమిళ ప్రేక్షకులకు

నచ్చితే చాలు — సిద్ధార్థ్

తన చిత్రాలు తమిళ ప్రేక్షకులకు నచ్చితే చాలని హీరో సిద్ధార్థ్ అన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'మిస్ యూ'. ఎన్.రాజశేఖర్ దర్శకత్వం వహించగా, శుక్రవారం విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఆయన మీడియాతో ముచ్చటిస్తూ.., 'ఒక మంచి స్టోరీతో సినిమా నిర్మించడం ఎంతో కష్టం. అలాంటి చిత్రమే 'మిస్ యూ'. ఈ రోజుల్లో థియేటర్‌కు వచ్చి సినిమాలు చూసే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఎవరికైనా బోర్‌కొడితే మొబైల్‌లో సినిమాలు చూసుకుంటున్నారు. అలా బోర్ కొట్టకుండా చూసే సినిమానే ఇది. 'బాయిస్' తర్వాత నాకు బాగా నచ్చిన సినిమా 'సిత్తా'. ఇపుడు 'మిస్ యూ'. ఇప్పటివరకు నేను టచ్ చేయని జోనర్‌లో తెరకెక్కించాం. పాత వైన్‌ను కొత్త బాటిల్‌లో ఇస్తున్నాం. పైగా నేను నటించే చిత్రాలు తమిళ ప్రేక్షకులకు నచ్చితే చాలు. అనేక కోణాల్లో నన్ను ఎంతగానే ఆకర్షించిన చిత్ర మిస్ యూ. 'సిత్తా' చిత్రానికి వచ్చిన ఆదరణ జీవితంలో మరిచిపోలేనిది. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా, విమర్శనాత్మకంగా మంచి పేరు తెచ్చిపెట్టింది. కానీ, ఒక నిర్మాతగా ఆ సినిమా విడుదల చేసేందుకు పడినపాట్లు అన్నీ ఇన్నీకావు. కెరీర్ ఆరంభంలో తెలుగులో వరుసగా ప్రేమ కథా చిత్రాలు చేయడం వల్ల క్లిష్టపరిస్థితులను ఎదుర్కొన్నాను. అందుకే గత పదేళ్ళుగా అటువైపు వెళ్ళలేదు. ఆ సమయంలోనే దర్శకుడు రాజశేఖర్ కలిసి ఈ స్క్రిప్టు వినిపించారు. ప్రపంచంలో మనకు నచ్చని యువతితో ప్రేమలో పడటం అనే లైన్ బాగా కనెక్ట్ అయింది. దీన్ని ఒక డిఫరెంట్‌గా తీయాలన్న నిర్ణయానికి వచ్చి విజయవంతంగా పూర్తి చేశాం. ఇపుడు నేను తెలంగాణ అల్లుడిని. నా భార్య అదితి రావు మరిన్ని సినిమాలు చేయాలి. పెళ్ళి తర్వాత నేను చాలా హ్యాపీగా ఉన్నాను. పాన్ ఇండియా పేరుతో ప్రతి సినిమాపై మనమే భారం మోపుతున్నాం. పలువురు దర్శకులు పబ్లిక్ పల్స్ ఆధారంగా చేసుకుని సినిమా తీశామని చెబుతున్నారు. ఇది ఒక మోసం' అని పేర్కొన్నారు.


'మిస్ యూ'లో ఓ దృశ్యం

డిసెంబరులో ఇండియన్ అవార్డుల ప్రదానం

లయోనా అండ్ లియో అనే నిర్మాణ సంస్థకు చెందిన ఇండియన్ మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 21, 22వ తేదీలో ఇండియన్ అవార్డులు-2024 ప్రదానోత్సవాన్ని నగరంలో నిర్వహించనున్నారు. వీటితో పాటు 'మిస్టర్ అండ్ మిస్సెస్ తమిళనాడు' పోటీలను కూడా నిర్వహించనున్నట్టు లయోనా అండ్ లియో నిర్మాణ సంస్థ అధినేత జాన్ అమలన్ వెల్లడించారు. ఈ విషయంపై మీడియాతో మాట్లాడుతూ, 'ప్రతి రెండేళ్ళకు ఒకసారి ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. డిసెంబరు 21, 22వ తేదీల్లో మూడో దఫా అవార్డులను అందజేయనున్నాం. కొత్తగా 'కెప్టెన్ విజయకాంత్ అవార్డు' కేటగిరీ ప్రవేశపెట్టి, అవార్డు అందజేస్తాం. 'మిస్టర్ అండ్ మిస్సెస్ తమిళనాడు' అందాల పోటీలను కూడా నిర్వహిస్తున్నాం. నేను భావించినట్టుగానే ఈ దఫా అగ్రహీరో విజయ్‌కు ఒక అవార్డు ప్రదానం చేస్తాను. ఈ అవార్డుల పంపిణీ కోసం ప్రత్యేకంగా 'ఇండియన్ మీడియా వర్క్స్' పేరుతో ఓ విభాగాన్ని ప్రారంభించాం. అర్హులైన నటీనటులను ఎంపిక చేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీ ఎంపిక చేసే నటీనటులపై అందరి అభిప్రాయాలు తీసుకుని తుది జాబితా తయారు చేసి, అవార్డులను ప్రదానం చేస్తాం' జాన్ అమలన్ వెల్లడించారు. అంతకుముందు లయోనా అండ్ లియో సినీ నిర్మాణ సంస్థ లోగోను ప్రముఖ దర్శకుడు, తమిళనాడు సినీ దర్శకులు సంఘం అధ్యక్షుడు ఆర్వీ.ఉదయకుమార్, మరికొందరు సినీ ప్రముఖులు కలిసి ప్రారంభించారు.



లయోనా అండ్ లియో లోగో ఆవిష్కరణ దృశ్యం


విద్యా సహాయాలు అందజేస్తున్న వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వీఐటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సహాయాలు

వేలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఉన్నత విద్య ట్రస్ట్ తరపున విద్యా సహాయం అందించే కార్యక్రమం వీఐటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం రాత్రి జరిగింది. కార్యక్రమానికి వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి పాల్గొని, 720 మంది విద్యార్థులకు రూ.62 లక్షల విద్యాసహాయాలు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ... ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల సంఖ్య దేశంలోనే తమిళనాడులో 50 శాతం ఉందన్నారు. ఉన్నత విద్య చదివే విద్యార్థినీ, విద్యార్థులకు నెలకు తలా రూ.1,000 అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, విద్య ముగిసిన అనంతరం 'నాన్ ముదల్వన్' పథకంలో ఉద్యోగం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అందరికీ ఉన్నత విద్య ట్రస్ట్ తరఫున వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన విద్యార్థులకు విద్యా సహాయాలు అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వాయుగుండం ఎఫెక్ట్

చెన్నైలో భారీ వర్షం

పలు ప్రాంతాలు జలమయం

బంగాళాఖాతంలో 'ఫెంగల్' తుపానుగా రూపుదిద్దుకోనున్న వాయుగుండం ప్రభావం కారణంగా నగరంలో మంగళవారం ఉదయం కుండపోతగా వర్షం కురిసింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమైనా తేలికపాటి జల్లులే కురిశాయి. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో అల్పవాయుపీడం కాస్త వాయుగుండంగా మారటంతో మంగళవారం ఉదయం 10 గంటలకు తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం కాసేపటికల్లా ఉధృతమైంది. ఎగ్మూరు, పురుషవాక్కం, కోయంబేడు, మధురవాయల్, కోడంబాక్కం, పెరంబూరు, తిరువొత్తియూరు, పట్టినంబాక్కం, రాయపురం, అంబత్తూరు, కొళత్తూరు, అన్నాసాలై, రాయపేట, ట్రిప్లికేన్, మైలాపూరు, మందవెల్లి, అడయార్, వేళచ్చేరి తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. దీనితో రహదారులు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు ఆకస్మిక దీవులుగా మారాయి. ప్రధాన రహదారులలో ముందు వెళుతున్న వాహనాలను కనిపించనంతగా వర్షం కురవటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదేవిధంగా చెంగల్పట్టు, తిరువళ్లూరు తదితర ప్రాంతాల్లోనూ జోరుగా వర్షం కురిసింది. చెంగల్పట్టు, పరనూరు, మహేంద్రా సిటీ, మరైమలర్‌నగర్, కాట్టాన్‌కుళత్తూరు ప్రాంతాల్లో వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

\- చెన్నై, ఆంధ్రజ్యోతి


ట్రిప్లికేన్‌లో...
టి నగర్‌లో వాననీటిలో నడిచి వెళుతున్న బాలికలు
కోయంబేడులో డ్రైనేజీ శుభ్రం చేస్తున్న కార్మికులు
పెరంబూరులో ...
ప్యారీస్ కార్నర్‌లో జలమయమైన రహదారి
వర్షం పడినా తప్పని జీవనయానం
టి నగర్ బస్టాండు చుట్టూ ప్రవహిస్తున్న వర్షపు నీరు
అలల తాకిడికి కోతకు గురై నెమ్మేలి తీరం
జలమయమైన అన్నానగర్‌లో నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు
నంగనల్లూరులో చంటిబిడ్డతో మహిళ


క్రేన్ సాయంతో పడవను ఒడ్డుకు చేర్చుతున్న కార్మికులు


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరువర్గాల ప్రతినిధులు

విజయా ఎలక్ట్రానిక్స్‌తో

వీఐటీ చెన్నై ఒప్పందం

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విజయా ఎలక్ట్రానిక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. పీఎంబీఎల్‌డీసీ రూపకల్పన అభివృద్ధిపై సాంకేతిక బదిలీ కోసం మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా వీఐటీ చెన్నై పీఎంబీఎల్‌డీసీ టెక్నాలజీ రంగంలో తన అత్యాధునిక పరిశోధన, మేథో నైపుణ్యాన్ని పంచుకుంటుంది. అయితే విజయా ఎలక్ట్రానిక్స్ డిజైన్‌కు జీవం పోయడానికి దాని తయారీ సామర్థ్యాలను ఉపయోగించుకుంటుంది. వీఐటీ చెన్నై వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం, ప్రొ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.త్యాగరాజన్, ఛాన్సలర్ సలహాదారు డాక్టర్ ఎస్‌పీ త్యాగరాజన్, డీన్ డాక్టర్ శివకుమార్, ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ డాక్టర్ సెంథిల్‌కుమార్, విజయా ఎలక్ట్రానిక్స్ ఎండీ శ్రీనివాసరావు తదితరులు ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ.. తమ ప్రొఫెసర్లు అనేక పరిశ్రమలకు సహకరిస్తున్నారని, తమ జ్ఞానాన్ని ప్రత్యక్ష ఉత్పత్తులుగా మార్చగలుగుతున్నారని వివరించారు. తాము పీర్-రివ్యూడ్ జర్నల్స్‌లో ప్రచురించడం కోసం మాత్రమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు పేటెంట్ ఇవ్వడం, సాంకేతికత బదిలీ సులభతరం చేయడం ద్వారా ఆవిష్కరణలను నడపడానికి పరిశోధనల్లో పాల్గొంటామని వివరించారు.

బాస్కెట్ బాల్ ఆసియా కప్‌లో

27 ఏళ్ల తరువాత విజయం

- కజకిస్తాన్‌పై గెలిచి అర్హత సాధించిన భారత్



చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫిబా ఆసియా కప్ బాస్కెట్ బాల్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో భారతదేశం చరిత్ర సృష్టించింది. సోమవారం రాత్రి నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 27 ఏళ్ల తరువాత కజకిస్తాన్‌పై అద్భుతమైన విజయం సాధించింది. 88-69 తేడాతో కజకిస్తాన్‌ను పరాజయం పాల్జేసి ఆసియా కప్‌కు అర్హత సాధించింది. తొలి మ్యాచ్‌లో ఓటమితో భారత జట్టు అభిమానుల్ని నిరాశకు గురి చేసిన జట్టు.. రెండో మ్యాచ్‌లో తిరుగులేని విజయంతో కజకిస్తాన్‌పై పైచేయి సాధించింది. తద్వారా వచ్చే ఏడాది జరుగనున్న ఆసియాకప్‌లో పాల్గొనే అవకాశాన్ని సురక్షితం చేసుకుంది. భారత్‌కు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలివున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21న ఇరాన్‌తో, 24న ఖతార్‌తో తలపడాల్సివుంది.

శబరిమల యాత్రికుల కోసం

- 'స్వామి చాట్‌బాట్' డిజిటల్ అసిస్టెంట్' ఆవిష్కరణ



చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రా అనుభవాన్ని మెరుగుపరచడానికి, కేరళలోని పతనంతిట్ట జిల్లా పరిపాలనా విభాగం, ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో 'స్వామి చాట్‌బాట్'గా పిలువబడే డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రారంభించింది. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ఇటీవల తన కార్యాలయంలో దీనిని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి దేవస్వోమ్ ప్రత్యేక కార్యదర్శి టీవీ అనుపమ, పతనంతిట్ట జిల్లా కలెక్టర్ ఎస్.ప్రేమ కృష్ణన్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. ఏఐచాట్‌బాట్ వాట్సాప్ నంబర్ 6238008000. శబరిమల ఆలయ పూజా సమయాలు, మెడికల్ హెల్ప్‌లైన్, వసతి సహాయం, రైల్వే, రవాణా సదుపాయాలు తదితరాలన్నింటినీ యాత్రీకులకు అందజేయడంలో ఈ నంబర్ సహాయపడుతుంది. తెలుగు, తమిళం, మలయాళ, ఇంగ్లీష్, హిందీ, కన్నడం భాషల్లో ఇది అందుబాటులో వుంటుంది.

కస్టమ్స్ కార్యాలయంలో

రాజ్యాంగ వజ్రోత్సవం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నాయకులు

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. హార్బర్ నియోజకవర్గంలోని కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షులు ఎం.కలైకుమార్, ట్రెజరర్ ఎమ్మెస్ కార్తికేయన్, ఉపాధ్యక్షులు పి.ఆదిలక్ష్మన్, పి.బాబు, ఎన్.మాలతి, వి.మునుస్వామి, ఈసీ సభ్యులు ఎండీ ఇందిర, బి.శ్రీనివాసన్, ఆర్.శంకర్ తదితరులు పాల్గొన్న ఈ రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా చెన్నై కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుల మత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికి కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోనే బాధ్యత అందరిపై ఉందని సూచించి, కస్టమ్స్ ఉద్యోగులతో కలసి ప్రతిజ్ఞ చేశారు.

ఆస్పత్రిలో చేరిన మంత్రి కేఎన్ నెహ్రూ




అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ అస్వస్థతతో ఆస్పత్రిలో చేరారు. గత కొంతకాలంగా జ్వరంతో బాధ పడుతున్న ఆయన.. థౌజండ్‌లైట్‌లోని అపోలో ఆస్పత్రిలో సోమవారం రాత్రి అడ్మిట్ అయ్యారు. ఆయన జ్వరంతో పాటు జలుబు, దగ్గు తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. దీంతో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. చికిత్స పూర్తయిన తర్వాత ఆయనను డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. కాగా మంత్రి ఆస్పత్రిలో చేరడం పట్ల ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

సాగర పోరాటం

సముద్రంతో పెనవేసుకున్న బంధం వారిది. చావైనా..బతుకైనా అక్కడే. పోరాటమూ సముద్రంతోనే, ప్రేమా సముద్రంతోనే. తిరుపతి జిల్లాలో 67 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరంలోని 32 మత్స్యకార గ్రామాల ప్రజల జీవనశైలి భిన్నంగా ఉంటుంది.





మత్స్యకారులు అర్ధరాత్రి దాటగానే నిద్ర లేస్తారు. వలలు భుజాన వేసుకుని తీరానికి చేరుకుంటారు. ఒంటి గంటకంతా నాటుపడవల్లో సముద్రంలోకి ప్రయాణం మొదలు పెడతారు. ఎగిసి దూకే అలలకు ఎదురేగుతారు. తీరం నుంచి దాదాపు 5 కిలోమీటర్ల దూరం దాకా సముద్రంలో ప్రయాణం చేస్తారు. చీకటి తెరల మాటునే వేట సాగిస్తారు. వలలకు చిక్కిన సంపదను పడవల్లో నింపుకుని వెనక్కి బయలుదేరుతారు. ఉదయం ఎనిమిదికల్లా తీరానికి చేరుకుని వలలు విప్పుతారు. ఆడవాళ్లు అప్పటికే అక్కడకి చేరుకుని ఉంటారు. చేపా, రొయ్యా, ఎండ్రకాయ... దొరికినవి వేరు చేసుకుని అమ్ముకుంటారు. 4 వేల మంది రోజువారీ జీవనం ఇది. ఏటా దాదాపు అయిదు వేల టన్ను మత్స్య సంపదను వీరు సముద్రం నుంచి సేకరిస్తున్నారు. వాకాడు మండలంలోని కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల్లో 1800 కుటుంబాలు ఇదే జీవనతో ఉన్నారు. వీరు పగలంతా తెగిన వలలు తిరిగి అల్లుకుంటూ గడుపుతారు. చదువుల మీద దృష్టి పెట్టరు. చిన్న వయసు నుంచే సముద్ర వేటకు బయలుదేరుతారు.



- వాకాడు, ఆంధ్రజ్యోతి



ఆడంబరాలూ.. అప్పులూ

వేట ద్వారా వేల రూపాయల ఆదాయం పొందుతున్నా.. వీరి దగ్గర ఎప్పుడు డబ్బులుండవు. వలలకూ, పడవల మరమ్మతులకూ భారీగా ఖర్చు అవుతుంది. వడ్డీకి అప్పుచేస్తారు. నోటిమాట మీద లక్షల అప్పు వీరికి ముడుతుంది. చేసిన కష్టమంతా తిరిగి అప్పుతీర్చడంలోనే కరిగిపోతుంది. ఊరి సంబరాలు ఆడంబరంగా నిర్వహిస్తారు. భారీగా ఖర్చు చేస్తారు. లక్షల అప్పు తెచ్చి మరీ వేడుకలు జరుపుకుంటారు. ఈ అప్పును ఇంటికింతని భరిస్తారు. అప్పులేని ఇల్లు మత్స్యకార గ్రామాల్లో దాదాపుగా ఉండదు.

పెద్దల మాటే శాసనం

మత్స్యకారులు ఒకే మాట మీద ఉంటారు. గ్రామ పెద్దలకు విలువ ఇస్తారు. పెద్దకాపు, నడిమికాపు, చిన్నకాపు అని గ్రామానికి ముగ్గురు పెద్దలుంటారు. వీరు చెప్పిందే తీర్పు. వీరి మాటే శాసనం. ఎవరూ అతిక్రమించరు. ఈ కట్టును దురాయి అంటారు. గొడవలు పడ్డా పోలీసుల దాకా వెళ్లరు.



'యూజో'తో హెచ్ఈసీఎస్ భాగస్వామ్యం



భాగస్వామ్యం వివరాలు ప్రకటిస్తున్న యూజో సీఈఓ డాక్టర్ సంగ్ కి కిమ్

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో నీటిని శుద్ధీకరించి పర్యావరణాన్ని మెరుగుపరిచే హబెర్ట్ ఇన్విరో కేర్ సిస్టమ్ సంస్థ, ఓడరేవుల నిర్మాణంలో పేరుగడించిన యూజో కో లిమిటెడ్‌తో భాగస్వామం కుదుర్చుకుంది. నగరంలో మంగళవారం జరిగిన సదస్సులో ఈ రెండు సంస్థల నిర్వాహకులు ప్రకటించారు. ఈ సదస్సులో రాష్ట్ర హరిత పర్యావరణ సంస్థ సలహాదారు డాక్టర్ రమేష్ రామచంద్రన్, యూజో సీఈఓ డాక్టర్ సంగ్ కి కిమ్, హెచ్ఈసీఎస్ సీఈఓ డాక్టర్ జేఆర్ మోసెస్, ఐఐటీ మద్రాసు ఓషన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేజీ విజయ్, సైంటిస్ట్ డాక్టర్ హెచ్ ఖర్క్వాల్ తదితరులు పాల్గొన్నారు.

44 లక్షల సహకార సంఘ సభ్యుల తొలగింపు

● తంజావూరులోనే అత్యధికం

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సహకార సంఘా ల్లో సభ్యులుగా ఉన్న వారిలో 44 లక్షల మందిపై అనర్హత వేటు పడింది. వీరిలో అత్యధికంగా తంజావూరు జిల్లాలోనే ఉన్నారు. జాతీయ సహకార శాఖ గణాంకాల మేరకు రాష్ట్రంలో 22,110 సహకార సంఘాలున్నాయి. వీటితో పాటు దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. అయితే, ఈ సహకార సంఘాల్లో ఉన్న సభ్యుల్లో అనేకమంది అనర్హులున్నట్టు అధికారులు గుర్తించారు. ఇలాంటి వారిని తొలగించేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. ఈ కోవలో ఇప్పటికి 44 లక్షల మందిని అనర్హులైన వారిగా గుర్తించి వారిని తొలగించారు. ఒక్క తంజావూరు జిల్లాలో గరిష్ఠంగా 3.23 లక్షల మంది అనర్హులను గుర్తించి తొలగించారు. ఆ తర్వాతి స్థానంలో మదురైలో 2.52 లక్షల మంది, సేలంలో 2.09 లక్షలు, తిరుచ్చిలో 2.08 లక్షలు, శివగంగై 2.03 లక్షల మంది సభ్యులు అనర్హులుగా గుర్తించి తొలగించారు. సభ్యులుగా తొలగించిన వారిలో దాదాపు 18 లక్షల మంది మరణించిన వారి జాబితాలో ఉండటం గమనార్హం. అలాగే, రెండేళ్ళుగా ఆధార్ నెంబరు సమర్పించని వారి పేర్లను కూడా తొలగించారు. వారు మళ్ళీ ఆధార్ నెంబరు సమర్పించిన తర్వాతే సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల్లో 1.46 కోట్ల మంది సభ్యులున్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 34600 రేషన్ దుకాణాలను సహకార సంఘాల ఆధీనంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సహకార సంఘాల సభ్యుల ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

సీఎం నివాసం వద్ద కత్తితో యువకుడి సంచారం

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నివాసగృహం పరిసరాల్లో కత్తితో సంచరించిన యువకుడిని పోలీసులు నిర్బంధించారు. తేనాంబపేట సెంటాఫ్‌రోడ్డులో స్టాలిన్ నివసిస్తున్నారు. సోమవారం రాత్రి ఆ నివాసం వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా చేతిసంచితో సంచరించాడు. అనుమానించిన ముఖ్యమంత్రి భద్రతాదళానికి చెందిన పోలీసులు అతడిని ఆపి సంచిలో చూసి దిగ్భ్రాంతి చెందారు. ఆ సంచిలో కత్తి ఉండటంతో వెంటనే అతడిని నిర్బంధించి తేనాంపేట పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఆ విచారణలో ఆ యువకుడు మరైమలర్‌నగర్‌కు చెందిన జాన్ అని తెలిసింది. పోలీసులు కత్తి గురించి ప్రశ్నించగా మరైమలర్ నగర్ నుంచి రైలులో నుంగంబాక్కం వచ్చానని, ఆ సమయంలో అక్కడ పడి ఉన్న కత్తిని చూసి కూరగాయలు తరిగేందుకు పనికి వస్తుందని సంచిలో వేసుకున్నానని తెలిపారు. ఆ తర్వాత పోలీసులు అతడి వివరాలు తీసకుని విడిచి పెట్టారు.

భారత రాజ్యాంగ విలువలు తెలుసుకోవాలి: కమల్



అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడు తెలుసుకుని పాటించాలని అగ్రహీరో, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్ హాసన్ పిలుపునిచ్చారు. ఈ విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 75 యేళ్ళ క్రితం ఇదే రోజు దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయం రూపొందిందన్నారు. రెండేళ్ళ 11 నెలలు, 17 రోజుల పాటు ఎన్నో వాదప్రతివాదనల తర్వాత రూపొందిన భారత రాజ్యాంగాన్ని 299 మంది పురుషులు, మహిళలు కలిసి ఒకచోట చేరి ఆమోదించారన్నారు. అలాంటి భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ పఠించి, అర్థం చేసుకోవాలన్నారు. ఈ రాజ్యాంగాన్ని అందించిన వారి చరిత్రను గౌరవించేలా ప్రమాణం చేయాలన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జరుపుకున్న ఈ తరుణంలో ఇందులో పేర్కొన్న అంశాలు, లక్ష్యాలను గ్రహించాలని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.





ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రం మూడో దశ విస్తరణ పనులను మంగళవారం ఉదయం పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి వి.సెంథిల్‌బాలాజీ

రేపటి నుంచి పద్మావతీ బ్రహ్మోత్సవాలు

● నేడు లక్ష కుంకుమార్చన.. అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 6వ తేది వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చనను నిర్వహించనున్నారు. అమ్మవారి అష్టోత్తర శతనామావళిని లక్ష సార్లు జపిస్తూ కుంకుమార్చన చేస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు టికెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చు. ఇక, బ్రహ్మోత్సవాలు ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో అంకురార్పణ నిర్వహించిననున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని తిరుచ్చిపై.. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. అక్కడ పుట్టమట్టిని సేకరించి తిరిగి ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు చేరుకుని అంకురార్పణ ఘట్టానికి శ్రీకారం చుడతారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

రేపు ధ్వజారోహణం

గురువారం ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య ధనుర్లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుంది. గజ ధ్వజానికి, ధ్వజస్తంభానికి పూజచేసి గజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేస్తారు. దీంతో ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తారు. ఆ రోజు రాత్రి ఏడు గంటలకు చిన్నశేషవాహనంతో అమ్మవారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. కాగా, గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుచానూరుకు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

పది రోజులపాటు ఆర్జిత సేవలు రద్దు

అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను పది రోజులపాటు రద్దు చేస్తున్నట్లు డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు. కుంకుమార్చన, వీఐపీ, బ్రేక్, కళ్యాణోత్సవంతో పాటూ వారపు, మాసపు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. డిసెంబరు 8 నుంచి ఆర్జిత సేవలు యధావిధిగా ఉంటాయన్నారు.

వాహన సేవలిలా

గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం చిన్నశేషవాహనం, 29న ఉదయం పెద్దశేషవాహనం, సాయంత్రం హంసవాహనం, 30న ముత్యపుపందిరి, సింహ, డిసెంబరు 1న కల్పవృక్ష, హనుమంత, 2న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం, 3న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం, రాత్రి గరుడ, 4న సూర్యప్రభ, చంద్రప్రభ, 5న రథోత్సవం, అశ్వవాహనం, 6న మధ్యాహ్నం 12.15 గంటలకు పంచమి తీర్థం, రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణం, 7న పుష్పయాగం.

వేడుకగా అమ్మవారి ఆలయ శుద్ధి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయశుద్ధి (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.



జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

నాయుడుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చెన్నై రహదారిపై మంగళవారం ఉదయం సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఓ లారీ మరమ్మతులకు గురవడంతో కావడంతో రహదారిపై ఆగి పోయింది. దీంతో రహదారికి రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఓ వైపు జోరున కురుస్తున్న వానలో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు.



తిరుపతి జిల్లాకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ పరిశ్రమ

● నాయుడుపేట వద్ద రూ. 3718 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి ● 116 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. తాజాగా నాయుడుపేట వద్ద రూ.3718 కోట్ల భారీ పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. దీనికి నాయుడుపేట వద్ద 116 ఎకరాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంత వేగవంతంగా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు ఈ పరిశ్రమే ఓ ఉదాహరణ. రబ్బర్ బ్లాక్స్, వాల్యూ యాడెడ్ కెమికల్స్ తయారీకి పేరుపడిన ఈ పరిశ్రమ.. నాయుడుపేట వద్ద ప్లాంట్ ఏర్పాటుపై తమ ఆసక్తి చూపింది. ఈ మేరకు 116.62 ఎకరాలను చదరపు మీటరుకు రూ.1948 ధరతో కేటాయించాలని సెప్టెంబరు 20న ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంది. రూ.3718 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, తదత్వారా 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేసింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఆ ఫైలు ఆయా విభాగాల నడుమ పరుగులు తీసింది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశమై అదే ధరతో భూమిని కేటాయించాలని సిఫారసు చేసింది. 19వ తేదీన బోర్డు ఆమోదించింది. ఈ సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నాయుడుపేట సెజ్‌ను డీనోటిఫై చేసి 116.62 ఎకరాల భూమిని ఫిలిప్స్ పరిశ్రమకు కేటాయించాలని ఏపీఐఐసీని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని సదుపాయాలనూ త్వరగా కల్పించి త్వరగా పరిశ్రమల ఏర్పాటయ్యేలా చూడాలని వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.

వ్యాను, బస్సు ఢీ కొని 15మందికి గాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం వేకువజామున తొట్టంబేడు మండలం జ్ఞానాంబకండ్రిగ సమీపంలోని నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరానికి చెందిన శ్రీనునాయక్ వ్యాపారి. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు సోమవారం వ్యానులో బయలుదేరారు. జ్ఞానాంబ కండ్రిగ వద్ద బెంగళూరు నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న టూరిస్టు బస్సు, వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యానులో ప్రయాణిస్తున్న శ్రీనునాయక్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సోమ్లు, సైదా, సంజు, జాను, ఆంజనేయులు, దద్దు, జశ్వంత్, మంజుల, రూప, నీల, వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు గాయపడ్డారు. ఇందులో ఆంజనేయులు ఎడమకన్నుకు తీవ్రగాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులు తిరుపతి రుయాకు తరలివెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అందరూ గాయాలతో బయటపడటంతో పెనుముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.





చికిత్స పొందుతున్న అంజనేయులు నాయక్, నవీన్ - దెబ్బతిన్న వ్యాను



సచివాలయంలో భారత రాజ్యాంగ అమృతోత్సవం సందర్భంగా మంత్రులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నావికాదళం తూర్పు మండలం కమాండర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ తత్వీందర్ సింగ్ సైనీ తదితరులు